# ప్రతిష్ఠకోసం....

• శ్రీమతి క. రంగనాయకమ్మ •

"ఏమోయ్, కరుణా! ఎందుకల్లా కూర్చున్నావు? ఏదో దీర్ఘాలోచనలో వున్నట్లున్నావే" అంటూ కరుణాకర్ దగ్గరకువచ్చి వొక కుర్చీమీద కూర్చున్నాడు మధుసూధనరావు.

"ఏం యిట్లా వచ్చావు? నీకీరోజు యేమీ సన్మానాలు లేవా ?" అన్నాడు కరుణాకర్.

"సన్మానాలు లేవు యేమీలేవు. ప్రొద్దున్న మెయిల్లో వచ్చాను ఒక విషయమై నిన్ను సలహా అడుగుదామని వొచ్చానోయ్"

"మీబోటి వాండ్లకు మేమేం చెప్పగలం. నీవొచ్చి నన్నడగడ మేమిటి ?"

"అదేమిటి కరుణా అట్లాగంటావ్, నేను నిన్ను సలహా అడగడం యీరోజు క్రొత్తా చెప్పు. నిన్ను సలహా అడగనిది; నీతో చెప్పనిది యేవిషయమైనా వుందా ? నేను, నీవు చిన్నప్పటినుంచి స్నేహితులం. నా చిన్నప్పుడే మా నాన్న గారు పోవడం, నేను యేదో తప్పిపోకుండా పరీక్షలు ప్యాసవుతున్నప్పటికి చదువులో చురుకుగా లేకపోవడం, మాఅమ్మ పడ్డ దిగులు యీ విషయాలన్నీ నీకు తెలియనివా ! యీమధ్య కొంతకాలం బట్టీ చిత్రకళ కొంచెం ప్రాముఖ్యం లోకి వస్తున్నది గాబట్టి నా అదృష్టం బాగుంటున్నది లేక పోతే నాజీవితం యెంత దుఃఖభాజనం అయి వుండేదో! కానీ కరుణా! మామయ్యవంటి మనుష్యులు చాలా అరుదోయ్ ఇప్పటి నా అదృష్టాని కంతా అతనేకదా కారణం నాకు చిన్నప్పటి నుంచి చిత్రకళలో వున్న అభిరుచి గ్రహించి, అతను నన్ను ప్రతిరోజు దీనిని వృద్ధిచేసుకోమని ప్రోత్సహిస్తూ, తగిన పరికరాలు కూడా తెచ్చిపెట్టేవాడు. ఎన్నడైనా మా అమ్మ "బొమ్మలు గీచుకుంటూ కూర్చుంటావు. ఇవేం నీకు కూడు బెడ్తాయా గుడ్డలిస్తాయాని పోయి చదువుకో చూడు వారబ్బాయికి నీకు మార్కుల్లో, యెంత తేడావుందో. వాణ్ణి చూచైనా నేర్చుకో" అని నన్ను కోప్పడితే, మా మామయ్య "యెందు కక్కయ్యా వాణ్ణి అట్లా కోప్పడుతావు వాడి కెందులో అభిరుచి వుందో అదే ప్రోత్సాహం చెయ్యి ఇంతకూ వాడేమీ పరీక్షలు తప్పడం లేదుగదా"—అనేవాడు.

"నీ ఆసరా చూచుకొని వాడు మరీ విఱ్ఱవీగుతున్నాడు" అని మా అమ్మ విసుక్కునేది నిజంగా కరుణా! తల్లి దండ్రులు గూడ చాలామంది యిటువంటి ప్రోత్సాహం యివ్వలేరోయ్. మా మామయ్య ఋణం నే నెట్లా తీర్చుకుంటానో"— అని తన సొదంతా వెళ్ళబుచ్చాడు మధుసూధనరావు కరుణాకర్ వింటున్నదీ లేనిదీ కూడ తెలుసుకోకుండా.

ఇద్దరూ కొంతసేపు నిశ్శబ్ధంగా కూర్చున్నారు.

"పోనీ అట్లా బీచికి షికారు పోదాము వస్తావా ?" అని మళ్ళీ మధువే హెచ్చరించాడు.

"నాకు తల నొప్పిగా వుంది; రెస్టు తీసుకుంటాను" అన్నాడు కరుణాకర్.

"సరే అయితే పడుకో నేను వెళ్ళి వస్తా"నని చెప్పి వెళ్ళిపోయినాడు మధు.

## 2

కరుణాకర్ తండ్రి గోపాలరావు మంచి స్థితిపరుడు. ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గావుండి రిటైర్ అయినాడు ఒక్కడే కొడుకు. అతనూ పండిత పుత్రుడుగాక చిన్నప్పటి నుండి బాగా చురుకుగా చదువు కుంటూ తల్లి దండ్రులకు తృప్తిని, సంతోషాన్ని చేకూర్చ గలిగాడు. ఏ విషయంలోను అతనికి లోటేలేదు. మొదట కొంత వెనక తీసినప్పటికీ విదేశాలకు పంపడానికి కూడ తలిదండ్రులు వొప్పుకున్నారు

మధుసూధనరావు తండ్రి ప్లీడరు. అతను అరాత్తుగా

మధు రెండవ యేట గుండె జబ్బువల్ల గతించాడు తల్లి ఆ కసికందును తీసుకొని అన్నగారైన కోదండరామారావు వద్దకు వచ్చింది కోదండరామారావు కూడ గోపాలరావు పనిచేస్తున్న కాలేజిలోనే హిస్టరీ ప్రొఫెసర్ గా వున్నాడు. ఇక రెండు మూడు సం॥లలో రిటైర్ అవుతాడు వీరిద్దరిండ్లు ప్రక్క-ప్రక్కన వుండడంవల్ల వీరికి కాలేజీలో వుద్యోగ రీత్యా అయిన పరిచయము కన్నా, యిరుగు పొరుగు వారుగా నున్న స్నేహం యెక్కువ. రెండు కుటుంబాల వారు సుమారు 20 సం॥లుగా స్నేహంగా వుంటున్నారు.

ఇక మధు, కరుణాకరుల మాట చెప్పనే అవసరములేదు వీరిద్దరి మధ్య యెటువంటి రహస్యములేదు. అన్నదమ్ముల లాగ వుండేవారు ఇద్దరూ మొదటి తరగతి నుంచీ ఇంటర్ మీడియట్ దాకా కలిసి చదువుకున్నారు. ఇంటర్‌లో ఫస్టు క్లాసులో ప్యాసైనాడు గాబట్టి అతనికి "ఆనర్సు" లో సీటు వచ్చింది మధు బి. ఏ. లో జేరాడు కరుణాకర్ "ఆనర్స్" ప్యాసయి ఆక్స్‌ఫర్డు యూనివర్సిటీలో యం. ఏ. డిగ్రీ పుచ్చుకొని తిరిగి వచ్చాడు. రైల్వే డిపార్టుమెంటులో వుద్యోగం చేస్తూ నెలకు రూ 1000 సంపాదిస్తున్నాడు ఉన్నత స్థితిలో జీవితం గడుపుతున్నాడు మధు బి ఏ పూర్తి చేశాడు. ఉద్యోగ మెక్కడా దొరకలేదు ఒడుదుడుకులతో కాలం గడుపుతున్నాడు.

కానీ కాలం వొక్క తీరుగా నడవదుగదా! ఎటువంటి వారికైనా మంచిరోజులు రాక మానవు. మధుకు అదృష్టపు రేఖ తిరిగింది. కొంత కాలంబట్టీ గొప్ప చిత్రకారుడనే పేరు వచ్చింది. పేరు ప్రఖ్యాతులతో పాటు కొంతధనం కూడ రాకపోలేదు. ఆవూరిలోనే గాక యితర పట్టణాల దాకాకూడ అతని ఖ్యాతి పాకిపోయింది. గొప్ప చిత్రకారుడని, కళావంతుడని తఱుచు సన్మానాలు జరుగుతూండేవి. కానీ అతను యిప్పటికీ నిరాడంబర జీవే బాగా కష్టాలు అనుభవించినవాడవుటచేత తాత్కాలిక వైభవం చూసుకొని గర్వపడక, తనపూర్వపు పరిస్థితులను స్మరణకు తెచ్చుకుంటూ కాలం గడుపుతున్నాడు

## 3

మానవుల జీవితంలో బాల్యావస్థ పవిత్రమైనది, స్వర్గతుల్యమైనది గదా! ఆ అమాయక హృదయాల్లో ఈర్ష్యా ద్వేషాలకు యిసుమంతైనా చోటుండదు అమాయక హృదయంతో, నిష్కల్మష ప్రేమతో వొకరి నొకరు ప్రేమించుకుంటారు కాని పెద్దవారైన తరువాత ఆ అమాయకత్వము మీద యేం మబ్బు కమ్ముతుందో! ప్రౌఢవయస్కులు కాగానే తగినంత కారణం లేకుండానే వొకరి మీద వొకరు అసూయ పడతారు, అసూయ మనస్సున పుట్టకే పోవాలి గాని పుట్టినట్లయితే క్షణక్షణానికి పెరిగిపోతుంది అమాయక హృదయాలు ద్వేషాంకురాలౌతాయి నిష్కల్మష ప్రేమలో ఈర్ష్యాగ్ని రగులుకొంటుంది ఎంత అన్యోన్యంగా వున్న వారినైనా కలచివేస్తుంది

కరుణాకర్‌కు మంచి చదువుంది పెద్ద వుద్యోగముంది ఏవిధంగా జూచినా మధుస్థితి తనకు తీసికట్టే అయినప్పటికీ కొద్దికాలంనుంచీ అతనికి మధు మీద అయిష్టం పుట్టింది. చిన్నప్పటినుంచీ వున్న అనురాగ బంధం సడిలింది. దీనికి కారణం మొదట్లో అతనికే అగోచరంగా వుండేను "నా ప్రాణస్నేహితుడి మీద నాకెందుకు అయిష్టత గలిగిందా?" అనే ఆలోచనలతో నిద్ర లేకుండా గడిపిన రాత్రిళ్ళు కూడ వున్నాయి కారణ మిదమిద్దమని తెలుసుకొనలేక పోయినాడు అయిష్టత మాత్రం తగ్గలేదు, సరిగదా క్రమంగా అసూయ క్రింద మారింది.

మధు జనసామాన్యంవల్ల పొందే గౌరవము, పలుకుబడే దీనికి మూలకారణము

కరుణాకర్‌కు వుద్యోగపు హంగు, హోదా అన్నీ వున్నాయి. పెద్ద వుద్యోగస్థుడగుటచేత నౌకర్లకు, అధికారానికికూడ లోటు లేదు. కాని మధుకు ప్రత్యేక ఖ్యాతి, విశిష్టత వచ్చి జనులచేత ఆదరింప బడడం, గౌరవింప బడడం అతను ఓర్వలేక పోయినాడు తన హంగు, హోదా అంతా వుద్యోగ ధర్మంవల్ల జరుగుతున్నవి. కాని మధు పొందే గౌరవము అతని యందుగల వొక ప్రత్యేక నేర్పుకు ప్రతిఫలం. దీనికి కాలపరిమితి లేదు. అతని జీవితానంతరము కూడ చిరస్థాయిగా నిలిచిపోతుంది యీ కీర్తి. ఉద్యోగ ధర్మంవల్ల గలిగే గౌరవ, ప్రతిష్టలు ఆస్థానమును అలంకరించినంత కాలమే అది చిరస్థాయిగా నుండజాలదు. ఈ విషయమే అతని మనస్సును కలచివేసింది పత్రికలలో మధు పేరు చూచినప్పుడల్లా అతని మనస్సు మరింత కలవరపడేది.

ఆరోజు అస్వస్థతకు కారణం కూడ అదే ఆ క్రితంరోజు "హిందూ" పత్రికలో మధుకు బెజవాడలో జరిగిన సన్మానం గురించి అతి విపులం గాను, ప్రశంశనీయం గాను వ్రాయబడి వుంది. అది చదివినప్పటినుంచీ అతని ఆందోళన చెప్పతరం గాకుండా వుంది ఇంకొక మిత్రుడే గనుకైతే ఆరోజు ప్రొద్దున్నే బెజవాడ నుంచి తిరిగివచ్చిన తన మిత్రునికి యెన్ని అభివందనము లర్పించి యుండే వాడో. అతి గాఢ మైత్రికే యిటువంటి బద్ద వైరాన్ని పుట్టించగల శక్తి వుండగల దేమో!

## 4

మధు అక్కడ వున్నంతసేపు మరీ ఆవేదన పొందింది కరుణాకర్ మనస్సు. అతను వెళ్లిన తరువాత కొంత స్థిమిత పడ్డాడు.

తను మధు కన్నా యెక్కువ ఖ్యాతి గడించడం యెట్లాగా అన్న దీర్ఘాలోచన అతనిని ముంచివేసింది. పరిపరి విధాల ఆలోచించి, కడకు స్వయంగా చిత్రకళలో కొంత ప్రవేశం వుండబట్టి, వేరొక మార్గంలో గాక మధు యే విద్యలో ఖ్యాతి గడించాడో, అదే కళలో తన నేర్పును, నైపుణ్యాన్ని లోకానికి వెల్లడించి, అతనికన్న తనుమిన్న యని చాటించాలెనని నిశ్చయించుకున్నాడు. కావలసిన పరికరాలతోపాటు ప్రసిద్ధ రచయితలు చిత్రకళను గురించి వ్రాసిన అనేక పుస్తకములు కూడా కొన్నాడు. అతి దీక్షతో పరమ రహస్యముగా నేర్చుకొనసాగాడు అతని కున్న పనులలో, బాధ్యతలలో పాపము అతనికి తీరికెక్కడిది? అయినప్పటికీ పట్టుదలతో నేర్చుకుని తన నేర్పును, శక్తిని వినియోగించి, రెండు మూడు చక్కని చిత్రాలను సృష్టించ గలిగాడు కాని తన స్నేహితుని అంతస్థుకు చేరుకోవడం అసాధ్యముగా గోచరించింది ఒకరిది దైవ ప్రసాదము, యింకొకరిది మానవ కృషి రెండింటిలోను తారతమ్యము కనపడక పోదు. అయినప్పటికి యితని కృషి శ్లాఘనీయము. చిత్రములు ప్రశంసనీయములుగా తయారైనవి

ఆరోజు ఆదివారము తన గదిలో చిత్రనిర్మాణంలో నిమగ్నుడై యున్నాడు కరుణాకర్. తలుపు తెరిచియున్న సంగతి మర్చిపోయినాడు. మధు అలవాటు ప్రకారం తన మిత్రునితో కొంతకాలం గడుపుదామని వచ్చాడు. కరుణా! అని పిలిచేడు. కాని అతనికి యీ పిలుపు వినపడలేదు. మధు మేడమెట్లు యెక్కి గదిలోకి వచ్చేడు. తన మిత్రుడి చిత్రములు చూసి మురిసిపోయినాడు నిశ్చలుడై నిలిచి తదేక దీక్షతో వానిని చూడసాగాడు.

కొంతసేపైన తరువాత కరుణాకర్ తిరిగి చూచాడు. తన వెనుక మధును చూసి నిశ్చేష్టుడైనాడు ఏదో తప్పుపని చేసిన వానిలాగ వొణికి పోయినాడు అతడు వెనుకకు తిరగడంతో మధు నిశ్చలత్వమునకు కూడ అంతరాయం కలిగింది ఒక్క అండలో వెళ్ళి కరుణాకర్‌ను కౌగలించుకుని "ఇంతకళను కడుపులో బెట్టుకొని యిన్నిరోజులనుంచి నాకు తెలియకుండ దాచుకున్నావా దొంగా!" అన్నాడు ఆప్యాయంగా.

కాని దీన్నంతా విపరీతార్థంలో తీసుకున్నాడు కరుణాకర్. మధు తనను పరిహసిస్తున్నట్లు తోచిందతనికి ఇక ముందు కుంచను ముట్టుకొనగూడదని నిశ్చయించుకున్నాడు మనస్సులో ఇంత శ్రమపడి నేర్చుకున్న విద్యను గంగపాలు జేయడానికి ఒడిగట్టాడు. అయితే తన ప్రతిజ్ఞ నెరవేరడం యెట్లా???

ఆరోజునుంచి చిత్రకళకు స్వస్తి చెప్పాడు వేరు మార్గమేమిటా అన్న ఆలోచనలో మునిగిపోయినాడు సాహిత్యంలో తనది యెప్పుడూ పైచెయ్యి గాబట్టి సభలలో వుపన్యాసాలు యివ్వడం ప్రారంభించాడు కొన్ని మార్లు అధ్యక్షత కూడ వహించాడు. అతని దురదృష్టమేమో, దైవవిధి యేమోగాని వుపన్యాసములు బాగున్నప్పటికీ వానిని పత్రికాసంపాదకులు ప్రాముఖ్యత నివ్వక యే మారుమూలనో యెవ్వరికీ కనపడకుండా ముద్రించారు ఈ నిరుత్సాహమే గాక యిటువంటి కార్యక్రమములలో పాల్గొనుటవల్ల అతను నిర్వహించవలసిన బాధ్యతలకు గూడ కొంత ఆటంకము వచ్చినది. దీనితో అతని మనస్సు పూర్తిగా నిస్పృహ జెందింది. అంతకంతకు యిది దావాగ్నిలాగ అతనిని దహించివేసింది ఏదో తెలియని బాధ ననుభవించేవాడు శారీరకంగా కూడ అస్వస్థత యేర్పడింది తన వుద్యోగ బాధ్యతలనుగూడ పూర్తిగా నెరవేర్చలేకపోయేవాడు ఒకటి రెండు మార్లు అధికారులచేత మాట కూడ పడవలసి వచ్చింది.

ఒకదానికొకటి తోడై కడకు అతనికి జీవితం మీద అసహ్యం పుట్టింది. జీవితం కడతేర్చుకోవాలన్న వూహ కలిగింది.

ఈర్ష్యాగ్ని యెంత భయంకరమైనది! ఇది మనస్సులో నున్నంతకాలం తన నాశనానికికూడ భయపడదు. జీవి ఎంతటి రాక్షస కృత్యానికన్నా పురి కొల్పుతుంది.

కరుణాకర్ యీ విధంగా నిశ్చయించుకున్నాడు. "సముద్రంలో పడి ప్రాణత్యాగం చేస్తాను. ఆ వార్త నా పేరు, వుద్యోగముతోసహా— పత్రికలలో ప్రచురింపబడుతుంది. నేను చూచుకొన లేకపోయినప్పటికి నా ప్రతిజ్ఞ నెరవేర్చుకుని జీవితమును చాలించినవాడ నవుతాను"

## 5

రాత్రి పది గంట లయింది. అడయారులో తన మిత్రుని యింటి విందుకు వెళ్ళి తిరిగి వస్తున్నాడు మ . ఏదో ఆలోచించుకుంటూ బీచి వొడ్డున నడిచి వస్తున్నాడు. చీకట్లో కొంత దూరంలో యేదో నీడ కనిపించింది. ఎవరా అనుకున్నాడు. "ఇంత చీకట్లో యెవరొస్తారు నా భ్రమకాని" అని మనస్సును సరిపుచ్చుకున్నాడు. మళ్ళీ తన దారిన ముందుకు సాగాడు. కాని మనస్సులో యేదో శంక బాధింప జొచ్చింది. ఇంతలో వెనకనుంచి ఆర్తనాదం వినవచ్చింది. పరుగెత్తుకుంటూ ఆ వైపుకు వెళ్ళాడు.

ఎంత దృఢనిశ్చయులైై వచ్చినప్పటికి ఆత్మహత్య చేసుకోవడం మహా కష్టం కదా! నిండు ప్రాణం పొయ్యేముందు తన ఆరాటాన్ని నలుదిక్కులా వ్యాపింపజేయనిదే పోలేదు. అందువల్లే కరుణాకర్ యెంత మనస్సు రాయి చేసుకున్నా ఆఖరు ఘడియకు ఆక్రందనము చేయకుండా వుండలేకపోయినాడు.

మధు నిలువు లోతుకు పోయి కరుణాకర్‌ను రక్షించి ఒడ్డుకు తీసుకొని వచ్చాడు అవసరమైన ప్రథమ చికిత్స చేసి అతనికి మళ్ళీ వూపిరి వచ్చేటట్లు చేశాడు. ఆతరువాత అతనిని మోసుకొని యిసుక నేలంతా దాటుకొని రోడ్డు దగ్గరకు వచ్చి వొక బండి చేసుకుని అతనిని సురక్షితంగా యిల్లు చేర్చాడు. ఆ రాత్రంతా అతనికి సేవచేస్తూ వారింట్లోనే గడిపాడు కరుణాకర్ తల్లి దండ్రులు ఇతనిని దైవస్వరూపంగా తలచి "మాకు పుత్రబిక్ష పెట్టావు నాయనా, నీ ఋణం తీర్చుకోలేము" అన్నారు. అందుకు మధు "మీరు పెద్దలు, అట్లనుకొనవద్దు. నా మిత్రునికి ఆపద సమయంలో సహాయపడి నా జీవితం సార్థకం చేసుకున్నాను. అంతే నాకు చాలు" అని జవాబు చెప్పాడు

కాని యెవ్వరికి కూడ కరుణాకర్ మానసిక వ్యథ తెలియదు గదా! అతను చెప్ప నలవిగాని వ్యధను జెందుతున్నాడు మరునాడు ఆత్రుతతో పత్రికను తీసి చూడసాగాడు అందులో ఈవిధంగా వ్రాయబడివుంది.

"నిన్నటి దినము యెవరో సముద్రములో కొట్టుకొని పోవుచుండగా అతనిని సుప్రసిద్ధ చిత్రకారులైన శ్రీ మధుసూధనరావు గారు రక్షించిరి. వారు... ........ ..

ఇంతవరకు చదివి కరుణాకర్ ఒక్క నిట్టూర్పు విడిచాడు

★

